సాక్షి
తూర్పుగోదావరి
గురువారం । 28 । డిసెంబర్ । 2023



గరిటెడైనను చాలు ఖరము పాలు!

గాడిద పాలతో వ్యాపారం లాభసాటిగా మారింది. తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం ఘంటావారిగూడేనికి చెందిన గుత్తికొండ కార్తిక్ ఈ వ్యాపారంలో రాణిస్తున్నాడు.



సహధర్మచారిణి విగ్రహంతో నివాళులు

పసలపూడి వాస్తవ్యుడు కొవ్వూరి సత్యనారాయణరెడ్డి గతించిన తన భార్య సత్యవేణి విగ్రహాన్ని తన ఇంట ఏర్పాటు చేసుకుని ప్రేమానురాగాలు చాటుకుంటున్నారు.

8 లో

డెల్టాలకు నీరు విడుదల



ధవళేశ్వరం: డెల్టా కాలువలకు బుధవారం 12,100 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 3800, మధ్య డెల్టాకు 2300, పశ్చిమ డెల్టాకు 6000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

న్యూస్‌రీల్

2 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష



వైద్యాధికారులతో రాష్ట్ర నోడల్ ఆఫీసర్ డాక్టర్ నిర్మలా గ్లోరీ, డీఎంహెచ్‌వో

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలో జనవరి రెండు నుంచి ప్రారంభం కానున్న జగనన్న ఆరోగ్య సురక్ష 2.0 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైద్యాధికారులను రాష్ట్ర నోడల్ ఆఫీసర్ డాక్టర్ నిర్మలా గ్లోరీ ఆదేశించారు. బొమ్మూరులోని జిల్లా వైద్యశాఖాధికారి కార్యాలయంలో బుధవారం ఆమె జగనన్న ఆరోగ్య సురక్ష 2.0పై ముందస్తు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష ప్రోగ్రాం షెడ్యూల్, అందులో జరిగే కార్యక్రమాలపై సమీక్షించారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మండలాల్లోని మెడికల్ ఆఫీసర్లకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ సంధ్య, డాక్టర్లు అభిషేక్, మౌనిక, రాజీవ్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సత్యకుమార్ నల్లూరి పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం పరిధిలోని ఎంఎల్‌హెచ్‌పీ/ సీహెచ్‌ఓ పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేయడానికి ప్రాంతీయ వైద్య, ఆరోగ్య సంచాలకులు నోటిఫికేషన్ జారీ చేశారని జిల్లా వైద్య,ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. నోటిఫికేషన్ వివరాలు ఈస్ట్‌గోదావరి.ఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో ఉన్నాయన్నారు. గురువారం నుంచి జనవరి 12వ తేదీ సాయంత్రం 5 గంటల వరకూ దరఖాస్తులకు గడువు ఉందన్నారు. ప్రాంతీయ వైద్య ఆరోగ్య సంచాలకులు, జోన్–2, గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ ప్రాంగణం, రాజమహేంద్రవరం చిరునామాకు దరఖాస్తులు పంపించాలన్నారు.

కోటసత్తెమ్మ వారికి చీర, సారె సమర్పణ



సారె తీసుకువస్తున్న మద్ది ఆంజనేయస్వామి ఆలయ ఈఓ కొండబాబు

నిడదవోలు రూరల్: మండలంలోని తిమ్మరాజుపాలెం గ్రామంలో కొలువైన శ్రీ కోటసత్తెమ్మ వారి తిరునాళ్ల మహోత్సవాలు రెండో రోజైన బుధవారం ఘనంగా జరిగాయి. ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెంలోని శ్రీ మద్ది ఆంజనేయస్వామి దేవస్థానం ఈఓ ఆకుల కొండబాబు, నిడదవోలు గ్రామ దేవత నంగాలమ్మ అమ్మవారి ఆలయ కమిటీ సభ్యులు వేద పండితుల ఆధ్వర్యంలో అమ్మవారికి చీర, సారె సమర్పించారు. కోటసత్తెమ్మను ఈఓ బళ్ల నీలకంఠం (శివ) పర్యవేక్షణలో ప్రత్యేకంగా అలంకరించి కుంకుమ పూజలు, హోమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు గాజుల రంగారావు, అయినీడి వెంకటకృష్ణ, మిద్దే శ్రీను, రేలంగి మారుతి శివభాస్కరరావు, ఉర్ల వీరవెంకటలక్ష్మి, బోనేపల్లి ఉమాదేవి, వద్దిరెడ్డి మహాలక్ష్మి, నిచ్చెనకోళ్ల భవాని, సొసైటీ అధ్యక్షుడు యాళ్ల రామారావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పథకం జీవనాధారం

రాజానగరం: కూలీలకు రోజువారీ పనులు దొరకని సమయంలో ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ప్రారంభించిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్‌ఆర్‌ఈజీఎస్) నేడు గ్రామీణ ప్రాంతాలలో కూలీలకు జీవనాధారమైందని ఆ పథకం సామాజిక తనిఖీ రాష్ట్ర స్థాయి డైరెక్టర్ జగదీష్ కుమార్ అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద ఎన్‌ఆర్‌ఈజీఎస్ అమలుపై బుధవారం కూలీలకు అవగాహన కల్పించారు. సామాజిక తనిఖీ బృందం ఆధ్వర్యంలో పాటలు, పద్యాలు పాడుతూ ఎన్‌ఆర్‌ఈజీఎస్‌లో చేపట్టే పనులు, పని దినాలు, కూలీలకు వచ్చే వేతనాలు, వారికి కల్పించిన హక్కులు, సదుపాయాలను తెలిపారు. తొలుత జరిగిన సమావేశంలో డైరెక్టర్ జగదీష్ కుమార్ మాట్లాడుతూ తొలిసారిగా రాజానగరంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామని, రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తామన్నారు. ఉపాధి హామీ పథకాన్ని సక్రమంగా వినియోగించుకుంటూ పారదర్శకంగా పనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ బి.రామారావు, ఎంపీడీఓ ఇన్‌చార్జి ఎం.సుబ్రహ్మణ్యం, ఏపీడీ రాంప్రసాద్, ఏపీఓ ఇన్‌చార్జి వెంకటేశ్వర్లు ప్రసంగించారు. కొందరు కూలీలు మాట్లాడుతూ పనిదినాలను 150కి పెంచాలని, గునపాలు, పారలు సరఫరా చేయాలని కోరారు.

బోధన స్మార్ట్..!

- విద్యా రంగంలో సంస్కరణకు ప్రభుత్వం శ్రీకారం
- ప్రభుత్వ పాఠశాలల్లో స్మార్ట్ పాఠాలు
- దృశ్య, శ్రవణ విధానంలో పాఠ్యాంశాల బోధన
- సులువుగా గుర్తుపెట్టుకుంటున్న విద్యార్థులు
- ఐఎఫ్‌పీ ప్యానల్స్, స్మార్ట్ టీవీల ఏర్పాటు
- విద్యార్థులు, ఉపాధ్యాయులకు ట్యాబ్‌ల పంపిణీ

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు	984
విద్యార్థులు	1,07,430
ప్రాథమిక పాఠశాలలు	706
ప్రాథమికోన్నత	86
ఉన్నత	192
డిజిటల్ బోధన చేస్తున్న పాఠశాలలు	297
ఐఎఫ్‌పీ ప్యానల్స్	386
స్మార్ట్ టీవీలు	1,099
8వ తరగతి విద్యార్థులు	15,028
అందించిన ట్యాబ్‌లు	5,510



రాజమహేంద్రవరం రూరల్ శాటిలైట్ సిటీ ఫ్లస్–2 పాఠశాలలో డిజిటల్ బోధన

సాక్షి, రాజమహేంద్రవరం: విద్యా రంగంలో అనేక సంస్కరణలకు ప్రభుత్వం నాంది పలికింది. 'నాడు–నేడు'తో పాఠశాలల రూపురేఖలు మార్చేసింది. కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దింది. మరో అడుగు ముందుకేసి పాఠ్యాంశాల బోధన మరింత అర్థవంతం చేసే దిశగా చర్యలు ప్రారంభించింది. ఈ క్రమంలో ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ బోధనను పరిచయం చేసింది. దృశ్య, శ్రవణం ద్వారా పాఠ్యాంశాలు బోధిస్తోంది. వెరసి పాఠశాల్లో బోధన, అభ్యసన సామర్థ్యాలు మెరుగుపడుతున్నాయి. విద్యా విధానంలో తీసుకువచ్చిన మార్పులు విద్యా ప్రమాణాల ఉన్నతికి ఎంతగానో దోహదం చేస్తున్నాయని తల్లిదండ్రులు అభిప్రాయ పడుతున్నారు. పుస్తకాలు చూసి బోధించడమే కాదు.. వాటిని దృశ్యం రూపంలో చూపిస్తుండటంతో విద్యార్థులు పాఠ్యాంశాలను సులువుగా గుర్తుపెట్టుకుంటున్నారు. పరీక్షలు అవలీలగా రాసేస్తున్నారు. తద్వారా మంచి ఉత్తీర్ణత శాతం నమోదవుతోంది.

జిల్లాలో ఇలా..

జిల్లా వ్యాప్తంగా 984 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. అందులో 706 ప్రాథమిక, 86 ప్రాథమికోన్నత, 192 ఉన్నత పాఠశాలలున్నాయి. వీటిలో మొత్తం 1,07,430 మంది విద్యార్థులు వివిధ తరగతుల్లో విద్యను అభ్యసిస్తున్నారు. విద్యా రంగంలో సమూల మార్పులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. విద్యా బోధనకు అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారు. డిజిటల్ తరగతులతో అర్థవంతమైన విద్య సాగుతోంది. గతంలో డిజిటల్ తరగతి గదులు పాఠశాలకు ఒకటి మాత్రమే ఉండేది. అది కూడా జిల్లా పరిషత్ పాఠశాలల్లోనే ఉండేది. ఉన్నా పూర్తి స్థాయిలో వినియోగించుకోలేని పరిస్థితి. అలాంటి పరిస్థితికి చరమగీతం పాడింది. 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు స్మార్ట్ టీవీలు, 6 నుంచి ఇంటర్ వరకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్(ఐఎఫ్‌పీ) ద్వారా బోధన అందిస్తున్నారు. 8వ తరగతి విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ట్యాబ్‌లు అందజేస్తోంది. అందులో 8 నుంచి ఇంటర్ వరకు బైజూస్ సంస్థకు చెందిన డిజిటల్ పాఠాలను అప్‌లోడ్ చేసి అందజేస్తోంది. ఇలా సర్వం డిజిటల్ విధానంలో బోధన సాగుతోంది.

ఐఎఫ్‌పీలు, స్మార్ట్ టీవీలు

జిల్లా వ్యాప్తంగా తొలి దశలో 297 పాఠశాలల్లో డిజిటల్ విద్యా బోధన అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా 1,099 స్మార్ట్ టీవీలు, 386 ఐఎఫ్‌పీలు అమర్చారు. వీటిలో బోధన కొనసాగిస్తున్నారు. ఐఎఫ్‌పీ ప్యానెల్స్, స్మార్ట్ టీవీల ద్వారా సులభతరంగా పాఠ్యాంశాలు అర్థమయ్యే రీతిలో బోధన పాఠశాలల్లో సాగుతోంది. బొమ్మలు, వీడియోలు, మెటీరియల్స్‌ను ప్యానెల్స్ ద్వారా వీక్షిస్తున్నారు. పదో తరగతి విద్యార్థులకు డిజిటల్ బోధన బాగా ఉపయోగపడుతోంది. గ్రాఫిక్స్ విధానంతో విద్యార్థులకు సులువుగా పాఠాలు అర్థం అవుతున్నాయి. ప్రతి ఒక్కటీ కనిపిస్తోంది. గతంలో సైన్స్ సబ్జెక్టులో పాఠ్యాంశాలు ఇలా ఉంటాయని ఊహించుకునే వారు. ప్రస్తుతం మానవ శరీరంలోని భాగాలు, విశ్వం ఇలా ఉంటాయని నేరుగా స్క్రీన్‌మీద చూడగలుగుతున్నారు. చదవడం కంటే.. చూసింది సులువుగా గుర్తుండిపోతోందన్న అభిప్రాయం విద్యార్థుల నుంచి వ్యక్తమవుతోంది. ప్రధానంగా గణితం, భౌగోళిక స్థితి, మొక్కలు, వాటి కణజాల పరిణామ క్రమం, జీవ పరిణామం అన్ని కళ్లకు కట్టినట్లు దర్శనమిస్తుండటతో పాఠం సులువుగా అర్థం అవుతోంది.

విద్యార్థులు, ఉపాధ్యాయులకు ట్యాబ్‌లు

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు, పాఠ్యాంశాలు బోధించే ఉపాధ్యాయులకు ప్రభుత్వం ట్యాబ్‌లు అందజేస్తోంది. 2022–23 విద్యా సంవత్సరంలో 15,291 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేయగా.. 2,445 మంది ఉపాధ్యాయులకు సైతం సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు. 2023–24లో 15,332 మంది 8వ తరగతి విద్యార్థులకు ఇటీవల 5,510 ట్యాబ్‌లు అందజేశారు. అంతేగాక ఈ ఏడాది కొత్తగా చేరిన 181 మంది 9వ తరగతి విద్యార్థులకు సైతం ట్యాబ్‌లు ఇచ్చారు. ట్యాబ్‌ల్లో ఈ పాఠశాల యాప్‌ను అప్‌లోడ్ చేశారు. 3వ తరగతి నుంచి ఇంటర్ వరకు పాఠాలను అప్‌లోడ్ చేశారు.

పక్కాగా పర్యవేక్షణ

డిజిటల్ బోధనను విద్యాశాఖ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ట్యాబ్‌లో ఉన్న పాఠాలను రోజూ చదవాల్సి ఉంటుంది. ప్రతి శుక్రవారం 10 నుంచి 15 నిమిషాల పాటు ఇంటర్నెట్ కనెక్ట్ చేసుకోవాల్సి ఉంటుంది. ఆ సమయంలో విద్యార్థులు ట్యాబ్ వినియోగించిన తీరు, ఎంత సేపు చదివారు, ఎన్ని పాఠాలను చూశారన్న ఆన్‌లైన్ డేటా ద్వారా సమాచారం ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు చేరుతుంది. సమాచారాన్ని పరిశీలించిన ఉన్నతాధికారులు ఆయా పాఠశాలల హెడ్ మాస్టర్లను అప్రమత్తం చేస్తున్నారు. ట్యాబ్‌లో నెలకొంటున్న సాంకేతిక సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నారు. ఇందుకోసం ఆయా సచివాలయాల్లోని ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అండ్ డిజిటల్ అసిస్టెంట్లను నియమించారు. ట్యాబ్‌లో సమస్యలు వచ్చిన వెంటనే వారిని సంప్రదిస్తే పరిష్కార మార్గం చూపుతున్నారు.



విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్న కలెక్టర్ మాధవీలత

విద్యార్థులకు ఆసక్తి



దృశ్య, శ్రవణ రూపకంగా చెప్పడం, బొమ్మల ద్వారా వివరించడంతో విద్యార్థులకు పాఠశాలకు రావాలన్న జిజ్ఞాస పెరుగుతోంది. డిజిటల్ విద్య సక్రమంగా అమలయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. 8వ తరగతి విద్యార్థులకు అందజేసిన ట్యాబ్‌లో ఇంటర్ వరకు బైజూస్ కంటెంట్ అప్‌లోడ్ చేస్తున్నారు. – ఎస్.అబ్రహం, డీఈఓ

కొబ్బరికి కనీస మద్దతు

- మిల్లింగ్ కోప్రాకు క్వింటాల్‌కు రూ.250
- కురిడీ కొబ్బరికి రూ.300 చొప్పున పెంపు



సాక్షి అమలాపురం: కొబ్బరి రైతులకు ఊరట. కొబ్బరి కనీస మద్దతు ధరలు (ఎంఎస్‌పీ)ని పెంచినట్టు కేంద్ర ప్రభుత్వం బుధవారం ప్రకటించింది. కమిషన్ ఫర్ అగ్రికల్చర్ క్రాప్ అండ్ ప్రైస్ (సీఏసీపీ) సిఫార్సు మేరకు కేంద్ర ప్రభుత్వం కనీస మద్దతు ధరలు పెంచింది. మిల్లింగ్ కోప్రా (ఎండు కొబ్బరి)కి క్వింటాల్‌కు రూ.250 చొప్పున, కురిడీ కొబ్బరి (బాల్ కోప్రా)కు రూ.300 చొప్పున పెంచింది. ప్రస్తుతం మిల్లింగ్ కోప్రాకు రూ.10,860 వరకు ధర ఉంది. పెంచిన ధరతో ఇది కాస్తా రూ.11,160కి చేరింది. బాల్ కోప్రా రూ.11,750 ఉండగా పెంచిన ధరతో రూ.12 వేలకు చేరింది. గత ఏడాది మిల్లింగ్ కోప్రాకు రూ.270, బాల్ కోప్రాకు రూ.750 పెంచిన విషయం తెలిసిందే. ఉమ్మడి గోదావరి జిల్లాలో వరి తరువాత ప్రధాన పంట కొబ్బరి. రాష్ట్రంలో 3 లక్షల ఎకరాల్లో కొబ్బరి సాగు జరుగుతుండగా, ఈ రెండు జిల్లాలోనే 1.7 లక్షల ఎకరాల్లో సాగవుతోందని అంచనా. ఇటీవల కాలంలో కొబ్బరి ధరలు ఒడిదొడుకులకు లోనవుతున్న విషయం తెలిసిందే. బహిరంగ మార్కెట్‌లో కనీస మద్దతు ధర కన్నా కొబ్బరి ధరలు పతనమైనప్పుడు రాష్ట్ర ప్రభుత్వం సిఫార్సు మేరకు కేంద్ర ప్రభుత్వం నాఫెడ్ ద్వారా కొబ్బరి కొనుగోలు చేయిస్తుంది. ఈ సమయంలో కేంద్రం ప్రకటించిన కనీస మద్దతు ధరలకు ఇక్కడ కొబ్బరి కొనుగోలు చేస్తుంటారు. ప్రస్తుతం జిల్లాలో నాఫెడ్ కేంద్రాల ద్వారా కొబ్బరిని కొనుగోలు చేస్తున్న విషయం తెలిసిందే. అయితే ప్రస్తుత కొబ్బరి సాగుకు అవుతున్న పెట్టుబడులకు, కొబ్బరి తయారీ ఖర్చులు పెరిగిన నేపథ్యంలో ఈ పెంపు పెద్దగా గిట్టుబాటు కాకున్నా ఏటా క్రమం తప్పకుండా కొబ్బరి ధరలు పెంచడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బీజేపీని సంస్థాగతంగా బలోపేతం చేస్తాం

రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

సాక్షి, రాజమహేంద్రవరం: భారతీయ జనతా పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు ప్రయత్నం చేస్తున్నామని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. రాజమహేంద్రవరంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తమ పార్టీ సిద్ధాంతాలు నచ్చి ఎవరైనా పార్టీలో చేరితే స్వాగతిస్తామన్నారు. రాష్ట్ర అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తున్నామని వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా 110 ఎలక్ట్రికల్ వాహనాలు కేంద్రం అమలు చేస్తున్న పథకాలను వివరిస్తూ ప్రచారం చేస్తున్నాయన్నారు. కేంద్ర పథకాలు తెలియకుండా గతంలో టీడీపీ తొక్కిపెట్టిందని ఆరోపించారు. ఆయుష్మాన్ భవ ద్వారా రూ.5 లక్షల హెల్త్ బీమా అందిస్తున్నామన్నారు. కేంద్ర సహకారంతో ఇక్కడ మెడికల్ కాలేజీ నిర్మాణం జరుగుతోందన్నారు. రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ ద్వారా ఆసుపత్రులకు బిల్లులకు చెల్లించకపోవడంతో వైద్యం అందట్లేదన్నారు. మోరంపూడి ఫ్లై ఓవర్ నిర్మాణం, ఎయిర్‌పోర్ట్ టెర్మినల్ అభివృద్ధి చేస్తున్నామన్నారు. అమృత్ పథకం ద్వారా 6,700 పైగా కుళాయి కనెక్షన్‌లు మంజూరు చేసినట్లు వివరించారు. రాజమహేంద్రవరం నుంచి సూర్యాపేట వరకు గ్రీన్ ఫీల్డ్ రోడ్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. అలాగే విజయనగరం వరకు ఎన్‌హెచ్–12 రహదారి అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. రూ.4800 కోట్ల వ్యయంతో రాజమహేంద్రవరం నుంచి దువ్వాడ వరకు మూడు లైన్ల రహదారి నిర్మాణం చేపట్టామన్నారు.

వైఎస్సార్ సీపీ విజయమే అందరి లక్ష్యం

- సిటీలో విజయకేతనం ఎగురవేద్దాం
- ఆత్మీయ కలయికలో ఎంపీ భరత్ రామ్



ఎంపీ భరత్ రామ్, రుడా చైర్మన్ రౌతు, సిటీ కో ఆర్డినేటర్ శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న పార్టీ కార్యకర్తలు

రాజమహేంద్రవరం సిటీ: త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని, సిటీ నియోజకవర్గంలో విజయ కేతనం ఎగురవేసి, జగనన్నకు బహుమతిగా అందజేయాలని ఎంపీ మార్గాని భరత్ రామ్ పిలుపు నిచ్చారు. జాంపేట పోలీసు కన్వెన్షన్ హాలులో రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు ఆధ్వర్యంలో బుధవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణుల ఆత్మీయ కలయిక నిర్వహించారు. ఎంపీ భరత్ రామ్ మాట్లాడుతూ సిటీ నియోజకవర్గంలో పార్టీ జెండా రెపరెపలాడటమే మనందరి లక్ష్యం కావాలన్నారు. ఈ నాలుగున్నరేళ్లలో నగర అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేశానని, భవిష్యత్తులో కూడా అదే స్ఫూర్తితో అంతే ఉత్సాహంగా పనిచేస్తానన్నారు. రాజమహేంద్రవరం సిటీ, రూరల్ నియోజకవర్గాలకు టీడీపీ ఎమ్మెల్యేలు ఉన్నా ఏనాడూ ప్రజా సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొన్నదే లేదన్నారు. 2015 గోదావరి పుష్కరాలకు ప్రత్యేక నిధులుగా రూ.2 వేల కోట్లను ప్రభుత్వం అందజేస్తే, నగరంలో ఎటువంటి అభివృద్ధి పనులూ చేపట్టకుండా టీడీపీ నేతలు మింగేశారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.400 కోట్లతో నగరంలో అభివృద్ధి, సుందరీకరణ పనులు చేపట్టామన్నారు.

విశ్వనగరంగా రాజమహేంద్రవరం

ఎంపీ భరత్ రామ్ మాట్లాడుతూ రానున్న ఎన్నికలలో ప్రజలు ఆశీర్వదిస్తే రాజమహేంద్రవరానికి విశ్వనగరంగా గుర్తింపు తీసుకువస్తామన్నారు. పార్టీలో ఉద్దండులైన నాయకులను ఏకతాటిపైకి తీసుకువస్తే వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయమని, త్వరలోనే అందర్నీ కలుస్తానని ఎంపీ భరత్ రామ్ తెలిపారు. అనంతరం రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, ఎంపీ భరత్ రామ్, సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను పార్టీ శ్రేణులు గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్, బీసీ రాష్ట్ర జేఏసీ చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు, గాండ్ల, తెలుకుల కార్పొరేషన్ చైర్ పర్సన్ సంకిస భవాని ప్రియ, పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, ఏపీఐడీసీ స్టేట్ డైరెక్టర్ కానుబోయిన సాగర్, వక్ఫ్‌బోర్డు జిల్లా అధ్యక్షుడు మహ్మద్ ఆరిఫ్, పార్టీ నాయకులు పోలు విజయలక్ష్మి, పెంకే సురేష్, పంతం కొండలరావు పాల్గొన్నారు.

జనవరి 3న సీఎం జగన్ రాక

కాకినాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జనవరి మూడో తేదీన జిల్లా కేంద్రం కాకినాడ రానున్నారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి ఈ విషయం చెప్పారు. వైఎస్సార్ పెన్షన్ కానుకను రూ.3 వేలకు పెంపుదల చేసే కార్యక్రమంతో పాటు వివిధ అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి ప్రారంభిస్తారన్నారు. బుధవారం ఆయన కమిషనర్ నాగ నరసింహారావు ఇతర అధికారులతో కలిసి సీఎంతో ప్రారంభించనున్న రాగిరెడ్డి వెంకట జయరాంకుమార్ కళాక్షేత్రాన్ని, స్కేటింగ్‌రింక్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దశలవారీగా పింఛన్ సొమ్మును పెంచుతామని ఇచ్చిన హామీ మేరకు ప్రస్తుతం ఉన్న రూ.2750 నుంచి రూ.3,000కు పెంచే కార్యక్రమాన్ని కాకినాడలో ప్రారంభిస్తారన్నారు. ముత్తా గోపాలకృష్ణ వారధి (కొండయ్యపాలెం ఫ్లైఓవర్), రూ 20 కోట్లతో నిర్మించిన రాగిరెడ్డి కళాక్షేత్రం, రూ.7 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించిన స్కేటింగ్ రింక్‌ను కూడా సీఎం ప్రారంభిస్తారన్నారు. కమిషనర్ నాగ నరసింహారావు మాట్లాడుతూ సీఎం ప్రారంభించనున్న కళాక్షేత్రం, స్కేటింగ్ రింగ్ ప్రగతిని ఎమ్మెల్యే ద్వారంపూడికి వివరించారు.

ఏర్పాట్లపై కలెక్టర్ కృతికా శుక్లా సమీక్ష

కాకినాడ సిటీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జనవరి 3న కాకినాడ పర్యటన ఖరారైన నేపథ్యంలో ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ ఎస్ ఇలక్కియ, అధికారులతో సమీక్షించారు.

ఎన్నికల విధులపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): నోడల్ అధికారులు తమ విధులను పూర్తి స్థాయిలో అవగాహన చేసుకుని, ఎన్నికల ప్రక్రియ కోసం సంసిద్ధులు కావాలని కలెక్టర్ మాధవీలత అన్నారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నోడల్ అధికారుల విధి విధానాలపై బుధవారం కలెక్టర్ మాధవీలత, ఇన్‌చార్జి జేసీ, కార్పొరేషన్ కమిషనర్ దినేష్ కుమార్‌తో కలసి దిశానిర్దేశం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ 2024 సార్వత్రిక ఎన్నికల కోసం నియమించిన నోడల్ అధికారులు తమ విధులపై పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇందుకు సంబంధించిన టీమ్ బృంద సభ్యులకూ అవగాహన కల్పించాలన్నారు. మానవ వనరుల నిర్వహణ వ్యవస్థలో నోడల్ ఆఫీసర్‌గా జిల్లా ఆర్థిక శాస్త్రం, గణాంక అధికారి, జిల్లా ట్రెజరీ అధికారిని నియమించామన్నారు. వీరు జిల్లాలో మానవ వనరులను గుర్తించడం, ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగడానికి కృషి చేయాలన్నారు. రవాణా నిర్వహణ కోసం నోడల్ అధికారులుగా ఆర్‌టీఓ, ఏపీఎస్‌ఆర్‌టీసీ అధికారులు వ్యవహరిస్తారన్నారు. వ్యయ పర్యవేక్షణ కోసం నోడల్ అధికారిగా జిల్లా ఆడిట్ అధికారి, అసిస్టెంట్ పేఅకౌంట్స్ ఆఫీసర్ ఉంటారన్నారు. బ్యాలెట్ పేపర్, పోస్టల్ బ్యాలెట్‌లకు ప్రాజెక్ట్ డైరెక్టర్, డిస్ట్రిక్ట్ వాటర్ మేనేజ్‌మెంట్ అధికారులు నోడల్ అధికారిగా ఉంటారన్నారు. వీరు సకాలంలో రవాణా, బ్యాలెట్ పత్రాలను ఓటర్లకు పంపిణీ చేయడం, తిరిగి వచ్చిన పోల్ చేసిన బ్యాలెట్‌లను లెక్కింపు కోసం సురక్షితంగా ఉంచడానికి ఏర్పాట్లు చేయడం వంటి విధులు నిర్వహిస్తారన్నారు. మీడియా నోడల్ అధికారిగా జిల్లా పౌర సంబంధాల అధికారిని నియమించామన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి చిరునామా జగన్

- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా
- పార్టీలో 120 మంది జనసేన కార్యకర్తల చేరిక



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: అభివృద్ధి, సంక్షేమానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిరునామాగా నిలిచారని రాజానగరం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. కోరుకొండ మండలం మునగాలలో 120 మంది జనసేన కార్యకర్తలు బుధవారం వైఎస్సార్ సీపీలో చేరారు. మేడా గురుదత్త ప్రసాద్, మండపాక శ్రీను ఆధ్వర్యంలో చేరిన వీరికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ ప్రశ్నించడానికి ఏర్పాటు చేసినట్టు చెప్పుకునే జనసేన.. దోపిడీ పార్టీ టీడీపీకి కొమ్ముకాస్తోందన్నారు. ఆ పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ నిర్ణయాలన్నీ గందరగోళంగానే ఉంటాయన్నారు. సేవ చేయాలన్న లక్ష్యంతో జనసేనలోకి వెళ్లిన మేడా గురుదత్త ప్రసాద్‌కు ప్రాధాన్యత ఇవ్వకపోవడం శోచనీయమన్నారు.

సమస్యలకు శాశ్వత పరిష్కారం

ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ ప్రజల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలన్న లక్ష్యంతో సచివాలయ వ్యవస్థను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చినట్టు తెలిపారు. మునగాల తదితర గ్రామాలకు గోదావరి వరద ముంపు బెడద తొలగిపోనుందన్నారు. దానిలో భాగంగా రూ.100 కోట్లతో రివర్స్ పంపింగ్ స్కీమ్ నిర్మాణానికి రాష్ట్ర భారీ నీటి పారుదలశాఖ మంత్రి అంబటి రాంబాబు శంకుస్థాపన చేశారన్నారు. ప్రజల నమ్మకాన్ని, విశ్వాసం ఫ్లెక్సీల ద్వారా రాదని హితవు పలికారు. కొన్ని కేసుల్లో నిందితుడైన బత్తుల బలరామకృష్ణకు జనసేన పార్టీ నాయకత్వం ప్రాధాన్యతివ్వడం సిగ్గుచేటన్నారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ శ్రేణులకు జక్కంపూడి కుటుంబం ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. జనసేన నాయకుడు బత్తుల బలరామకృష్ణ ఆర్భాటం తప్ప, ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. కార్యక్రమంలో కోరుకొండ జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అడపా కనకరాజు, కోకన్వీనర్ గణేశుల పోసి, మేడా గురుదత్త ప్రసాద్, మండపాక శ్రీను, మండపాక కోటేశ్వరరావు, పెద్ద వెంకన్న, లోవరాజు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కారు ఢీకొని మహిళ మృతి



ప్రమాద స్థలంలో తలకు గాయమైన నాగమణికి సపర్యలు చేస్తున్న స్థానికులు

కాకినాడ రూరల్: బంధువుల ఇంట్లో దశ దిన కార్యక్రమంలో పాల్గొనేందుకు ప్రత్తిపాడు మండలం లంపకలోవ నుంచి తిమ్మాపురం వస్తున్న భార్యభర్తలు ప్రమాదానికి గురికాగా, భార్య కినుము నాగమణి(51) మృతి చెందింది. తిమ్మాపురం పోలీసులు తెలిపిన వివరాల మేరకు తిమ్మాపురంలోని బంధువుల ఇంట్లో పరామర్శ కోసం భార్య నాగమణితో కినుము చక్రం బుధవారం లంపకలోవ నుంచి పయనమయ్యాడు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో తిమ్మాపురం ప్రవేశంలోని వై.జంక్షన్ వద్దకు వచ్చే సరికి వారి వాహనాన్ని వెనక నుంచి కారు ఢీకొంది. దీంతో నాగమణి ముందుకు పడిపోవడంతో తలకు బలమైన గాయమైంది. చక్రానికి స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే ఆమెను సమీపంలోని మెడికవర్ ఆస్పత్రిలో చేర్చగా మృతి చెందినట్టు వైద్యులు వెల్లడించారు. చక్రం ఫిర్యాదు మేరకు ఎస్సై షరీఫ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మానసిక ఒత్తిడితో యువకుడి ఆత్మహత్య

అమలాపురం టౌన్: జీవితంలో ఏమీ సాధించలేకపోయాను.. బతకడం వృథా అని రూరల్ మండలం భట్నవిల్లి శివారు రజకపేటకు చెందిన కుడుపూడి బాల వెంకట హరిప్రసాద్ (25) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అమలాపురం కాలేజీ రోడ్డులో గల జేడీ వరల్డ్ స్టూడియోలో పనిచేస్తున్న అతడు అదే షాపులో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని బుధవారం ఉదయం మృతి చెందినట్లు పట్టణ ఎస్సై మనోహర్ జోషి తెలిపారు. ఇటీవలి కాలంలో హరిప్రసాద్ మానసిక ఒత్తిడితో ఉంటున్నాడని ఎస్సై చెప్పారు. కుటుంబాన్ని తాను సరిగా చూసుకోలేక పోతున్నానని వేదనతో చనిపోతున్నట్టు సూసైడ్ నోట్ రాసి పెట్టినట్టు ఎస్సై తెలిపారు. హరి ప్రసాద్ తండ్రి శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గరిటెడైనను చాలు ఖరము పాలు!

గంగి గోవు పాలు గరిటెడైనను చాలు..

కడివెడైన నేమి ఖరము పాలు అని ఆర్యులు అనగా.. బాగా చదవని పిల్లలను అయ్యోర్లు వెళ్లి గాడిదలను కాసుకోండ్రా అనేవారు. అప్పట్లో గాడిదకి అంతే విలువ ఇచ్చేవారు. రోజులు మారాయి. సాంకేతికత పెరిగింది. వస్తు విలువలు పెరుగుతున్నాయి. దీంతో ఆర్యుల, అయ్యోర్ల మాటలకు అర్థాలు మారి పోతున్నాయి. గాడిదల పెంపకం, వాటి పాలతో వ్యాపారం లాభసాటిగా మారింది. దీంతో వాటికి ఆదరణ పెరిగింది. తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం ఘంటావారిగూడేనికి చెందిన గుత్తికొండ కార్తిక్ ఈ వ్యాపారంలో రాణిస్తూ పలువురికి మార్గదర్శకంగా నిలుస్తున్నాడు. అతని విజయం వెనుక ఉన్న ఆలోచన, ఆచరణ, ప్రయాణాన్ని కార్తిక్ ఎంతో గొప్పగా నిర్వహిస్తున్నారు.

- లాభసాటిగా గాడిద పాల వ్యాపారం
- సాఫ్ట్‌వేర్ ఉద్యోగి వినూత్న ప్రయోగం
- లీటరుకు రూ.5 వేల నుంచి రూ.7.5 వేలు
- 40 గాడిదలతో ఫామ్ నిర్వహణ



డాంకీ ఫామ్



డాంకీ ఫామ్‌లో కార్తిక్



గాడిదలకు పాలు తీస్తున్న కార్తిక్ సహాయకుడు

నల్లజర్ల: కరోనా కష్టకాలం ఎందరో బతుకులను ఛిద్రం చేసింది. ఉన్న ఉద్యోగాలు, ఉపాధులు కోల్పోయి ఏంచేయాలో తెలియక ఆకాశ హర్మ్యాల్లో నివసించే పెద్దపెద్ద ఉద్యోగులు సైతం నేల చూపులు చూడాల్సి వచ్చింది. ఆ తరుణంలో చదివిన దానికి తగ్గట్టు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ హైదరాబాద్, బెంగళూరులో వర్క్ ఫ్రమ్ హోమ్ విధానంలో సొంతూళ్లకు పయనమైన వారు ఎందరో. కరోనాతో పోరులో రోగ నిరోధకశక్తి పెంచుకోవడానికి ఎవరికి తోచిన పద్ధతులు వారు అవలంబిస్తున్న రోజులవి. ఆ పద్ధతుల్లో వెలుగుచూసిన విషయం గాడిద పాలు. ఎంతో బలవర్ధకమైనవని, రోగ నిరోధక శక్తిని పెంపొందిస్తాయని బాగా ప్రచారం జరిగింది. దీంతో వాటి ఖరీదు ఎక్కువైనా చాలామంది వాటిని కొని వినియోగించేవారు. ఈ విషయం కార్తిక్‌ను ఆలోచింపజేసింది. ఈ క్రమంలో ఆ పాలపై అతడు కొంత పరిశోధన కూడా చేశాడు. చివరికి డాంకీ ఫాం పెట్టాలని నిర్ణయించారు. కర్ణాటక, గుజరాత్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, మహారాష్ట్రలలో గాడిద పాల వినియోగం ఎక్కువ. అక్కడ డాంకీ ఫామ్‌లు ఎక్కువ. అక్కడికి వెళ్లి ఫామ్‌ల నిర్వాహకుల నుంచి పూర్తి సమాచారం సేకరించడమే కాక కొంత శిక్షణ కూడా తీసుకున్నారు. అనంతరం స్వస్థలానికి వచ్చి తమ వ్యవసాయ క్షేత్రంలో శ్రీవెంకటేశ్వర డాంకీ ఫామ్‌ను మూడు నెలల క్రితం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం చిన్నా, పెద్దా కలిపి 40 వరకు గాడిదలు ఉన్నాయి. కొన్ని సంస్థల వ్యక్తులతో ముందే ఒప్పందం కుదుర్చుకుని పాలు సరఫరా చేస్తున్నారు.

లీటరు పాలు రూ.ఏడున్నర వేలు..

ఆవు, గేదెపాల కంటే గాడిద పాలు ఖరీదెక్కువ. లీటరు రూ.5 వేల నుంచి రూ.ఏడున్నర వేల వరకు ఉంటాయి. ఇందులోని ప్రొటీన్లు సులువుగా జీర్ణమవుతాయి. బాడీ బిల్డర్లకు ఇవి ఎంతో మేలు. వీటిలో ఏ,బీ,సీ,డీ విటమిన్లు, కాల్షియం సమృద్ధిగా ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంపొందించి యాంటీ బాడీలను అభివృద్ధి చేస్తాయి. ముఖ వర్చస్సుకు, మొటిమల నివారణకు, చర్మసౌందర్యానికి ఇవి ఎంతో దోహదపడతాయంటున్నారు.

కొత్త ప్రణాళికలు

అవకాశం ఉన్నప్పుడే అందిపుచ్చుకోవాలంటారు పెద్దలు. గాడిద పాల ధర ఎక్కువగా ఉండడంతో అవసరం ఉన్నవారు ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేయలేరు. అటువంటి వారి కోసం టెట్రా ప్యాకెట్లలో నిల్వచేసి విక్రయిస్తున్నారు. త్వరలో మార్కెట్లోకి 50, 100 ఎంఎల్ టెట్రాప్యాక్‌లోను 250 ఎంఎల్ అల్యూమినియం ప్యాక్‌లో తీసుకువస్తున్నట్టు కార్తిక్ చెబుతున్నారు. గాడిద మూత్రాన్ని సైతం ఎగుమతి చేసే అవకాశాలున్నాయి. వ్యర్థాలను పొలాల్లో ఎరువుగా ఉపయోగిస్తున్నారు. పేడను ఎరువుగా తయారు చేసే కంపెనీలు రానున్నాయి.

చులకన మాటలు దాటి..



గాడిద పాల వ్యాపారం చేయడం ఏంటని కొందరు చులకనగా మాట్లాడారు. హాయిగా ఉద్యోగం చేసుకుకోకుండా గాడిదలు చుట్టూ తిరగడం ఏంటని, రిస్క్ తీసుకోవడం ఎందుకని చాలా మంది తొలుత వెనక్కి లాగారు. భయాన్ని వ్యక్తం చేశారు. మొదట్లో ఇంట్లో వాళ్లు సానుకూలంగా లేరు. చాలా కష్టపడి వారందరినీ ఒప్పించాను. చిన్నాన్న సూర్యచంద్రరావు సహకారంతో ఎట్టకేలకు డాంకీ ఫామ్ ప్రారంభించా. కొద్ది రోజులకే సత్ఫలితాలు అందుకుంటున్నా **– కార్తిక్, డాంకీ ఫాం నిర్వాహకుడు**

రేపు బీజేపీ నేత పురందేశ్వరి రాక

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి శుక్రవారం జిల్లా పర్యటనకు రానున్నట్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ బుధవారం విలేకర్లకు తెలిపారు. ఆ రోజు ఉదయం రామారావుపేటలోని పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవం, అనంతరం ఎన్‌ఎఫ్‌సీఎల్ రోడ్డులోని కాపు కల్యాణ మండపంలో పార్టీ శక్తికేంద్ర, పోలింగ్ బూత్ అధ్యక్షుల సమావేశంలో పాల్గొంటారన్నారు. మధ్యాహ్నం కాపు కల్యాణ మండపంలో జిల్లా కార్యవర్గ సభ్యుల సమావేశం ఉంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మిస్తున్న గోదావరి కళాక్షేత్రాన్ని పరిశీలిస్తారని చెప్పారు.

లేఖరి హత్యకేసు పురోగతిపై ఎస్పీ ఆరా



ఎస్పీ జగదీష్

నల్లజర్ల: మండలంలోని పుల్లలపాడులో గత నెల 28వ తేదీ రాత్రి జరిగిన దస్తావేజు లేఖరి కాట్రగడ్డ ప్రభాకరరావు హత్య కేసు దర్యాప్తు పురోగతిపై ఎస్పీ పి.జగదీష్ ఆరా తీశారు. డీఎస్పీ వర్మ, సీఐ సున్న రాజు, ఎస్ఐ నరసింహమూర్తిలను కేసు వివరాలు అడిగి తెలుసుకున్నారు. బుధవారం సాయంత్రం ఏలూరు నుంచి రాజమహేంద్రవరం వెళ్తూ మార్గమధ్యంలో నల్లజర్ల పోలీస్ స్టేషన్ వద్ద కొద్దిసేపు ఆగి వివరాలు సేకరించారు. ఆయన వెంట సీసీఎస్ సీఐ రజనీకుమార్ ఉన్నారు.

కాశీ, అయోధ్య యాత్రకు ప్రత్యేక ఆర్టీసీ సర్వీసు

రావులపాలెం: కాశీలోని విశ్వేశ్వర మందిరం, అయోధ్యలోని నూతనంగా నిర్మించిన రామ మందిరం దర్శనానికి ప్రత్యేక సూపర్ లక్సరీ బస్సు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ కేడీఎంఎస్ కుమార్ బుధవారం తెలిపారు. ఈ బస్సు జనవరి 21న బయలుదేరి అన్నవరం, సింహాచలం, అరసవిల్లి, పూరీ క్షేత్రము, కోణార్క్, భువనేశ్వర్, సాక్షి గోపాలం, జాజ్‌పూర్, గయ, బుద్ధగయ, శిరోగయ, కాశీ క్షేత్రం (కాశీ నందు మూడు రోజులు నిద్ర చేస్తారు) అక్కడ నుంచి త్రివేణి సంగమం, సీతామఢి, ప్రయాగ, అయోధ్య, నైమిశారణ్యం దేవాలయాల దర్శనం అనంతరం ఫిబ్రవరి మూడో తేదీ నాటికి తిరిగి రావులపాలెం చేరుతుందన్నారు. టికెట్ ధర ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రి టిఫిన్‌తో కలిపి రూ.13,700 నిర్ణయించామన్నారు. ఈ సౌకర్యాన్ని భక్తులు వినియోగించుకుని సంస్థను ఆదరించాలని కోరారు. మరిన్ని వివరాలకు, టికెట్ల కోసం అసిస్టెంట్ మేనేజర్ కార్యాలయంలో, 73829 11871 నెంబరులో సంప్రదించాలని డీఎం కుమార్ తెలిపారు.

చేబ్రోలులో అర్ధరాత్రి దుండగుల దాడి

- ఇళ్లు, దుకాణాల ధ్వంసం
- భూ వివాదమే కారణమని భావిస్తున్న పోలీసులు



దుండగులు కూల్చేసిన ఇళ్లు, దుకాణాలు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చేబ్రోలులో మంగళవారం అర్ధరాత్రి కొందరు గుర్తు తెలియని దుండగులు నివాస గృహాలు, దుకాణాలపై దాడికి తెగబడ్డారు. యంత్రాలతో విచక్షణా రహితంగా వాటిపై దాడి చేసి కూల్చి వేయడంతో పాటు గృహాల్లోని నిర్వాసితులను తాళ్లతో బంధించి దాడికి తెగబడినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం మేరకు చేబ్రోలు శివారున ఉన్న నివాసాలపై సుమారు 50 మంది మారణాయుధాలతో దాడికి దిగారు. తమ వెంట తీసుకువచ్చిన యంత్రాలతో ఇళ్లను కూల్చివేయడంతో పాటు అడ్డుకున్న వారిపై దాడికి పాల్పడ్డారు. బాధితుల వద్ద ఉన్న సెల్ ఫోన్లను లాక్కుని వారు బయటకు వెళ్లకుండా బంధించి ఇళ్లను, దుకాణాలను కూల్చేశారు. భూ వివాదమే దీనికి కారణంగా చెబుతున్నారు. దాడి సమయంలో 100 కాల్ సెంటర్‌కు కాల్ చేసినా స్పందన లేదని ఎప్పుడు తిరిగే పెట్రోలింగ్ వాహనం కూడా రాలేదని, విద్యుత్ సైతం తీసేశారని బాధితులు పేర్కొన్నారు. సీఐ సంఘటనా స్థలాన్ని పరిశీలించి బాధితుల నుంచి వివరాలు సేకరించారు.

సహధర్మచారిణి విగ్రహంతో నివాళులు



సత్యనారాయణరెడ్డి ఏర్పాటు చేసిన సత్యవేణి విగ్రహం

రాయవరం: మాంగళ్యం తంతునానేనా మమజీవన హేతునా అంటూ వివాహ సమయంలో భర్త మూడు ముళ్లు వేసి ధర్మేచ.. అర్థేచ.. కామేచ నాతిచరామి అని ప్రమాణం చేసి సహధర్మచారిణిగా మరో ఇంటి ఆడపిల్లని తన జీవన సహచరిగా తెచ్చుకుంటాడు. ఆ ప్రమాణానికి విలువనిస్తూ మండలంలోని పసలపూడి వాస్తవ్యుడు కొవ్వూరి సత్యనారాయణరెడ్డి గతించిన తన భార్య సత్యవేణి విగ్రహాన్ని తన ఇంట ఏర్పాటు చేసుకుని ప్రేమానురాగాలు చాటుకుంటున్నారు. 1970 అక్టోబరు 18న వారిరువురూ ఒకటయ్యారు. వృత్తి రీత్యా ఉపాధ్యాయుడైన ఆయనకు లాల్‌బహదూర్ కుమారుడు ఉన్నారు. కరోనా వారింట కాఠిన్యం చూపించి 2021 మే 21న సత్యవేణిని వారి నుంచి దూరం చేసింది. తన భార్యపై అనురాగంతో సత్యనారాయణరెడ్డి సత్యవేణి విగ్రహాన్ని తన పొలంలో ఏర్పాటు చేసుకుని బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన భార్య నిరంతరం పేదల కోసం పరితపించేదని, ఎంతో మంది మహిళలకు కుట్లు, అల్లికలు నేర్పించి, ఉచితంగా కుట్టు మెషీన్లు ఇచ్చినట్టు తెలిపారు. ఆమె జ్ఞాపకాలతో శేషజీవితం గడుపుతానన్నారు. ఆమె జ్ఞాపకాలను వీడలేకే విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

విద్వేషపూరితం నూతన విద్యా విధానం

- మాజీ ఎమ్మెల్సీ బాలసుబ్రహ్మణ్యం
- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలు ప్రారంభం



ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభల్లో పతాకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

కాకినాడ సిటీ: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన విద్యా విధానం (ఎన్ఈపీ) విద్వేషాన్ని నింపేలా ఉందని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాల సుబ్రహ్మణ్యం ధ్వజమెత్తారు. బుధవారం ఎస్ఎఫ్ఐ 24వ రాష్ట్ర మహాసభలు కాకినాడ అంబేద్కర్ భవన్‌లో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ సమాన, నాణ్యమైన విద్యను అందించడంలో ఎన్ఈపీ పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ముందుగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కె.ప్రసన్నకుమార్ స్వాతంత్రం, ప్రజాస్వామ్యం, సోషలిజం నినాదాలు ఉన్న జెండాను ఆవిష్కరించారు. ఎస్ఎఫ్ఐ ఆలిండియా అధ్యక్షుడు వీపీ సాను అమరవీరుల స్థూపానికి, అల్లూరి సీతారామరాజు, ధీరజ్ రాజేంద్రన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆలిండియా ఉపాధ్యక్షులు ఆదర్శ సాజి, ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం తదితరులు నివాళులర్పించారు. అలాగే ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ఎమ్మెల్సీ ఇళ్ల మాట్లాడుతూ 53 ఏళ్లుగా ఎస్ఎఫ్ఐ అనేక సమరశీల పోరాటాలు చేసిందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.వరహాలు, ఎం గంగా సూరిబాబు, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

ఐరన్ గడ్డర్‌ను ఢీకొట్టిన ఎక్స్‌ప్రెస్ సర్వీసు

- రోడ్డు కమ్ రైల్ వంతెనపై ఘటన
- నిలిపివేసిన అవుట్ పోస్టు పోలీసులు
- గంటల తరబడి ప్రయాణికుల పడిగాపులు

కొవ్వూరు: రోడ్డు కం రైలు వంతెనపై నుంచి ప్రస్తుతం ఎక్స్‌ప్రెస్ బస్సులను అనుమతించడం లేదు. ఇందుకోసం వంతెనకు రెండు వైపులా ఐరన్ గడ్డర్లను కూడా ఏర్పాటు చేశారు. ఈ విషయం తెలియని తెలంగాణకు చెందిన ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సు బుధవారం సాయంత్రం వంతెనకు కొవ్వూరు వైపు ఏర్పాటు చేసిన ఐరన్ గడ్డర్‌ను ఢీ కొట్టింది. దీంతో గడ్డర్ విరిగిపోయింది. వివరాలిలా ఉన్నాయి. తెలంగాణ ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సు బుధవారం సాయంత్రం రాజమహేంద్రవరం వైపు నుంచి హైదరాబాద్ బయలు దేరింది. ఈ బస్సుకు రాజమహేంద్రవరం వద్ద రైల్ కమ్ రోడ్డు వంతెనపై ఐరన్ గడ్డర్ ఉన్నప్పటికీ ఎలాంటి సమస్యా రాలేదు. బస్సు కింద నుంచి వెళ్లిపోయింది. ఆ బస్సు కొవ్వూరు వైపునకు వెళ్లాక అక్కడున్న గడ్డర్‌ను ఢీ కొట్టింది. సమీపంలో ఉన్న అవుట్ పోస్టు పోలీసులు బస్సును నిలిపివేశారు. దీంతో రెండు గంటలకు పైగా ప్రయాణికులు రోడ్డుపైనే పడిగాపులు పడుతున్నారు. కొవ్వూరు పట్టణ సీఐ వి.జగదీశ్వరరావు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

నిరంతర కృషితో లక్ష్య సాధన

తిరుమల విద్యాసంస్థల చైర్మన్ తిరుమలరావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న తిరుమలరావు

రాజమహేంద్రవరం రూరల్: ప్రతి విద్యార్థీ ఒక నిర్దిష్ట లక్ష్యాన్ని ఎంచుకుని దాని సాధనకు నిరంతరం కృషి చేయాలని తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు అన్నారు. బుధవారం రాజమహేంద్రవరం తిరుమల క్యాంపస్‌లో ఇన్‌స్పిరిట్–2023 ప్రోగ్రామ్‌లో తిరుమలరావు పాల్గొని మాట్లాడారు. దేశవ్యాప్తంగా జరిగే జేఈఈ–2024కు 12.3లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారని, గత ఏడాదితో పోల్చితే ఈ సారి 68 వేల మంది అధికంగా ధరఖాస్తు చేసుకున్నారన్నారు. వారిలో దేశ వ్యాప్తంగా మహారాష్ట్ర టాప్‌లో ఉంటే తర్వాతి స్థానంలో ఏపీ, మూడో స్థానంలో తెలంగాణ ఉన్నాయన్నారు. పోటీని దృష్టిలో ఉంచుకుని ఇంకా ఎలా చదవాలో, ఏ విధంగా చదివితే పలు ఐఐటీ, ఎన్ఐటీ, ఐఐఐటీ, బిట్స్‌లలో సీట్లు సాధించగలమో తెలుసుకుని సాధన చేయాలన్నారు. 2023లో తిరుమల రాజమహేంద్రవరం, విశాఖపట్నం, భీమవరం క్యాంపస్‌లు నుంచి ఆయా సంస్థల్లో 657 మంది ఎంపికయ్యారన్నారు. ఈ ఇన్‌స్పిరిట్–2023 సందర్భంగా రాజమహేంద్రవరం క్యాంపస్ నుంచి ఐఐటీ, ఎన్ఐటీ, ఐఐఐటీ, బిట్స్‌లకు ఎంపికైన 447 విద్యార్థులు రావడం అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థులకు ఆయన షీల్డ్ అందజేశారు. అకడమిక్ డైరెక్టర్ సతీష్‌బాబు, డైరెక్టర్ సరోజినిదేవి, ప్రిన్సిపల్ శ్రీహరి, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, తిరుమల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

శాస్త్ర, అవధానాల కలబోత సందీప్ శర్మ



అష్టావధానం చేస్తున్న తాతా సందీప్‌శర్మ తదితరులు

'సారస్వత మార్గశీర్షం' అవధానంలో విశ్వనాథ గోపాలకృష్ణ

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): శాస్త్ర, అవధాన రంగాల కలబోతగా రాణిస్తున్న యువ అవధాని తాతా సందీప్ శర్మ అని మహామహోపాధ్యాయ విశ్వనాథ గోపాలకృష్ణ అన్నారు. స్థానిక ప్రకాశం నగర్ రౌండ్ పార్క్ దగ్గర గల 'ధర్మంచర' హాలులో నాలుగు రోజుల 'సారస్వత మార్గశీర్షం' అష్టావధానాలలో భాగంగా మూడో రోజు బుధవారం సందీప్ శర్మ అవధానం చేశారు. సభకు విశ్వనాథ గోపాలకృష్ణ అధ్యక్షత వహిస్తూ, అవధానం గురించి, అద్వైతం గురించి వివరించారు. శృంగేరీ జగద్గురువుల ఉపదేశాలను సభకు తెలియజేశారు. అవధానం దిగ్విజయంగా జరగాలని ఆశీర్వదించారు. పద్య కళాతపస్వి డాక్టర్ ధూళిపాళ మహాదేవమణి అవధాన సంచాలనం చేశారు. అవధాన విద్యలో ఉన్న సాంకేతికతను అర్థం చేసుకోవాలని విద్యార్థులకు బోధించారు. నన్నయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ మాట్లాడుతూ అవధానం అంటే ఏకాగ్రత అని, అసమాన జ్ఞాపక శక్తి ఉంటేనే అవధానాలు చేయగలరని అన్నారు. అసాధారణ ప్రతిభ చూపుతూ 60కి పైగా అవధానాలు చేసిన తాతా సందీప్ శర్మను అభినందించారు. అనంతరం అవధాని సందీప్ శర్మను ఘనంగా సత్కరించారు. ఘంటావధానం ప్రదర్శనను శ్రీ గౌతమీ స్కూల్ విద్యార్థులు ఆస్వాదించారు. సీనియర్ పాత్రికేయులు వీఎస్ఎస్ కృష్ణకుమార్ సభానిర్వహణ చేశారు. కోరుకొండ సుజాతా దేవి (నిషిద్ధాక్షరి), శుభకోటి వీరయ్యశర్మ (సమస్య), కాళ్లకూరి సత్య శిరీష (దత్తపది), కోసూరి చండీప్రియ (వర్ణన), శ్రీ నూజిళ్ళ శ్రీనివాస్ (వ్యస్తాక్షరి), ఎస్ఎల్‌డీ భవాని (ఘంటావధానం), డాక్టర్ తలారి వాసు (అప్రస్తుత ప్రసంగం) పృచ్ఛకులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో డాక్టర్ ధూళిపాళ అన్నపూర్ణ, డాక్టర్ మహేశ్వరి, తాతా వరప్రసాద్, తాతా విజయలక్ష్మి, జోరాశర్మ, వీవీ సుబ్రహ్మణ్యం, దువ్వూరి మల్లికార్జునరావు, బూడిద వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రాణులు ద్వంద్వాలను అనుభవించాల్సిందే

సామవేదం షణ్ముఖశర్మ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): దశరథుని మరణానికి దుఃఖిస్తున్న భరతునితో వశిష్ఠుడు సమస్త ప్రాణులు మూడు ద్వంద్వాలను అనుభవించి తీరాలని హితోపదేశం చేశాడని సమన్వయ సరస్వతి సామవేదం షణ్ముఖ శర్మ అన్నారు. బుధవారం హిందూ సమాజంలో ఆయన 15వ రోజు ప్రవచనం చేశారు. ఆకలి దప్పికలు ప్రాణ ధర్మాలు, జరా మరణాలు దేహ ధర్మాలు, శోక మోహాలు మనో ధర్మాలు అనే ద్వంద్వాలను సామవేదం వివరించారు. మంథరను రోషంతో తీసుకువచ్చిన శత్రుఘ్నుడితో భరతుడు మంథరకు కీడు చేయవద్దని ఆమెకు కీడు చేస్తే రాముడు మనతో మాట్లాడడని అంటాడు. భరతుని మించిన భాగవతోత్తముడు లేడు, భక్తి కలిగి ఉంటేనే ధర్మము సార్థకమవుతుందని భరతుని ఇతివృత్తం ద్వారా మనం తెలుసుకోవాలన్నారు. భగవంతుడు సర్వదా మనలను గమనిస్తున్నాడన్న ఎరుక మనకు ఉంటే, ఏకాంతంలో కూడా మనం తప్పులు చేయబోమని అన్నారు. కొందరు మంత్రులు భరతునితో తండ్రి ఆదేశం మేరకు పట్టాభిషిక్తుడవు కావాలని విన్నవిస్తే, భరతుడు భయభ్రాంతుడవుతాడు. జ్యేష్ఠుడే రాజు కావాలన్నది పరంపరగా వస్తున్న ధర్మమని, తాను రామునికి బదులు వనవాసం చేస్తానని, రాముడే ప్రజలకు ఏలిక కావాలని భరతుడు స్పష్టం చేస్తాడు. వందిమాగధులు ఉదయాన్నే స్తోత్రపాఠాలు చేస్తుంటే, వారిని ఆపుచేసి, ఈ దేశానికే రాముడు రాజు అని, తాను అడవిలోనే రామునికి పట్టాభిషేకం చేస్తానని అంటాడు. మనో సందర్భంలో సామవేదం మాట్లాడుతూ గతించిన వారు ఎవరైనా ముందు యమలోకానికి వెళ్లాలని, అక్కడి నుంచి వారి కర్మానుసారం ఫలితాలను పొందుతారని అన్నారు. దశరథుడు స్వర్గలోకానికే వెళ్లాడనే విషయాన్ని రామాయణం, యుద్ధకాండలో మనం చూస్తామన్నారు.

31న రాష్ట్రస్థాయి చదరంగం పోటీలు

ప్రకాశం నగర్: జిల్లా చదరంగం సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 31న ఆదివారం మహిళల రాష్ట్రస్థాయి చదరంగం పోటీలు నిర్వహిస్తున్నట్టు సంఘం కార్యదర్శి జీవీ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక హార్డ్‌వేర్, పెయింట్స్ అసోసియేషన్ హాలులో జరిగే ఈ పోటీల్లో మొదటి నలుగురు విజేతలు, ఫిబ్రవరి 4న మహారాష్ట్రలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు మన రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు. పోటీల్లో పాల్గొనదలిచిన క్రీడాకారులు ఏపీ చెస్ ఓఆర్‌జీ వెబ్ సైట్‌లో గురువారం సాయంత్రం లోపు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

అధిక చార్జీలు వసూలు చేస్తే చర్యలు

కాకినాడ సిటీ: సంక్రాంతి సందర్భంగా జిల్లాలో కాకినాడ నుంచి దూర ప్రాంతాలైన హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై, విజయవాడ, విశాఖపట్నం తదితర ప్రాంతాలకు వెళ్లే బస్సులు యజమానులు పరిమితికి మించి అధిక మొత్తంలో ఛార్జీలు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని ఉప రవాణా కమిషనర్ ప్రసాద్ హెచ్చరించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ అధిక చార్జీలను అరికట్టేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాల వాహన తనిఖీ అధికారులు వాహనాలను తనిఖీ చేస్తాయన్నారు. ప్రయాణికులు ఫిర్యాదు చేయాల్సి వస్తే 91542 94314కు తెలియజేయాలన్నారు.